

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



### నడచి వచ్చిన దారి.

**మెల్లగా వాకింగ్ అని చెప్పి** ఇల్లు దాటి బయటికి వెళ్లడం మొదలుపెట్టాను. స్ప్రింగ్ నుండి సమ్మర్ వరకు పబ్లిక్ ప్లేసెస్ అన్ని జనాలతో నిండి ఉండేవి. వాకింగ్ వెళ్లే వాళ్లు, స్ట్రోలర్ లో పిల్లలని పెట్టుకుని జాగింగ్ చేసే వాళ్లు, సైక్లింగ్ చేసేవాళ్లు, ప్లే ఏరియాలో కేరింతలు కొట్టే పిల్లలు, వారిని ఒక కంట గమనిస్తూనే కబుర్లలో మునిగిపోయే వాళ్ల తల్లితండ్రులు, మనుషుల కన్నా దర్జాగా గున గున తిరిగేస్తూ ఉండే రకరకాల కుక్కలూ భలే సందడిగా సరదాగా ఉండేది స్ప్రింగ్ -సమ్మర్ సమయం. ఇంతలా కాకపోయినా కరోనా భయంలోనూ బాగానే వస్తున్నారు పార్కులకి జనాలు. కాకపోతే సోషల్ డిస్టెంసింగ్ పాటించకుండా మాస్కులు లేకుండా స్వేచ్ఛగా తుమ్ముతూ దగ్గుతూ వచ్చేసేవారు ఎక్కువయ్యేసరికి సుబ్బరంగా పార్కుకి వెళ్లడం కూడా మానేసి మా నైబర్ హుడ్ లోనే మూడు నాలుగు బ్లాకుల చుట్టూ తిరగడం మొదలుపెట్టా. పదడుగుల దూరం నుండే మనిషిని పసిగట్టి పక్కకు తప్పుకు వెళ్ళిపోతూ కానిస్తున్నాం వ్యాహ్యాళి. వారాంతాలు 'సోషల్ బబుల్' అని చెప్పి ఒక కుటుంబం తమకి తెలిసిన ఇంకొక్క కుటుంబంతో మాత్రమే కలుస్తూ కాలక్షేపం చేస్తున్నాము. ఒకరికి తెలియకుండా ఇక వేరే కొత్త వారిని కలవడానికి లేదన్నమాట. ఇలా నెమ్మదిగా తెలిసినన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఎవరి సోషల్ బబుల్ వాళ్లు పెంచుకుంటూ క్వారెంటైన్ నుండి మెల్లిగా బయటపడుతున్నాము. కేసులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి.

ఇలా ఉండగానే కొద్ది కొద్దిగా ఈ కరోనా షెల్టర్ ఇన్ ప్లేస్ పర్యవసానాలు బయటపడుతూ వస్తున్నాయి. విమాన రాకపోకలు ఇంకా సరిగ్గా లేనందువల్ల 2020 సంవత్సరం ముందు ముందు పిల్లల దగ్గరికి వచ్చిన తల్లితండ్రులు ఇక్కడే చిక్కుకుపోయారు. వారిలో అసహనం రోజు రోజుకి పెరిగిపోతోంది. అందులోనూ ఒకరు ఇండియాలో ఒకరు ఇక్కడ చిక్కుకుపోయిన పెద్దవారి పరిస్థితి మరీ బాధాకరం. ఈ వయసులో ఇండియాలో సహాయం దొరకక అక్కడ వారు, వారిని చూసి ఇక్కడి వారు దిగులు పెట్టేసుకుంటున్నారు. కూతురికి ఏడో నెల పడ్డప్పుడు వచ్చిన వారు, మనవడి మొదటి పుట్టిన రోజు వరకూ ఇక్కడే చిక్కుకుపోయిన కథలు ఎన్నో ఈ సమయంలో. రోజూ పడుకునే ముందు "ఏమయ్యా నన్ను పంపించే మార్గం ఏదైనా దొరికిందా?" అని అడిగే పెద్దవారికి ఏం సమాధానం చెప్పాలో తేలీని అయోమయంలో ఉన్నారు పిల్లలు.

పెద్దవాళ్లు రాకుండానే పుట్టేసిన 'లాక్ డౌన్ బేబీస్' తల్లితండ్రులది ఇంకో సమస్య. ఫోన్లలో, వీడియో కాల్స్ లో సలహాలు తీసుకుంటూ పుట్టిన పాపాయికి కలిసి పోషణ చూసుకుంటున్నారు. టెక్నాలజీ ద్వారా అన్నీ సమకూర్చుకోగలుగుతున్నాం కానీ మనిషికి ఇంకో మనిషి తోడు, అండ కరువైపోయాయి.

విదేశంలో చదువుకోవాలి అనే ధ్యేయంతో, భవిష్యత్తు గురించిన బోలెడు కలలతో వచ్చిన విద్యార్థులకు నిజంగా పరీక్షా సమయం ఇది. క్యాంపస్లన్నీ మూసేసారు. వీసా సమస్యల వల్ల వసతి, భోజనాలకి పార్ట్ టైం జాబ్స్ లేని వారికి చాలా ఇబ్బందిగా ఉంది. ఇండియా నుండి డబ్బులు పంపగలిగే స్థోమత ఉన్నవారికి పరవాలేదు కానీ మిగతా పిల్లలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడికి మన భారతీయ సంఘాల వాళ్లు ఏదో విధంగా సహాయం అందిస్తున్నారు. సంవత్సరానికి మూడు పంటలు పండిస్తూ మోతుబరి రైతుగా ఊర్లో 'ఒకప్పుడు' పేరుపడిన పెదతాత మనువడు బోస్టన్ లో ఉన్నత చదువులకని వచ్చి ఈ కరోనా సమయంలో పార్ట్ టైం జాబ్ కూడా లేక ప్రవాస తెలుగు సంఘం వారి నిత్యావసరాల సహాయంతో నెట్టుకొస్తున్న విషయం తెలిసి ఊరంతా ఆశ్చర్యపడిపోయింది మరి.

ఇవి చాలవు అన్నట్టు మళ్లీ మార్పులు చేర్పులు చేసి కొత్తగా విడుదల చేసిన వలసదారుల వీసా నియమ నిబంధనలు. మళ్లీ కొత్త నిబంధన వచ్చేవరకూ అటు నుండి ఎవరు కొత్తగా ఇటు వచ్చే సూచన లేదు. డిపెండెంట్లు, సరైన వీసాలేని వారు వెళితే తిరిగి వచ్చే దారులు లేవు. అష్టదిగ్బంధనం. అసలు ఇక్కడి ప్రభుత్వం విడుదల చేసిన కొత్త వీసా నియమాలు అర్థం చేసుకోడానికే ప్రత్యేకం ప్రైవేట్ చెప్పించుకోవాలేమో అనేటన్ని లొసుగులు. మూలన పడ్డ అమెరికా ఇమ్మిగ్రేషన్ సర్వీస్ అప్లికేషన్లు. ఉద్యోగం చేసుకునే సదుపాయం ఇచ్చే ఈఏడి వీసా 'రెన్యువల్' కి మాత్రమే తొమ్మిది నెలల దాక పడుతోంది సమయం అంటే చూసుకోండి. ఎవరిని మాట్లాడించినా ఒక్కొక్కరిది ఒక్కో కథ. ఒకరి ఓపికకి పరీక్ష పెట్టాలంటే వారిచేత వీసా కోసం అర్జీ పెట్టిస్తే చాలు అసలు.

ఇన్ని కష్టాలూ సామాన్యులకు మాత్రమే సుమా! ఈబి5 అనే కొత్త ప్రోగ్రాం కింద అమెరికా ప్రభుత్వం చెప్పిన అంకె అంత సొమ్ముని వారు నిర్దేశించిన ప్రాంతాల్లో పెట్టుబడి పెడితే ఏకంగా పౌరసత్వమే వచ్చేస్తుంది. కొలిచే వేలుపు ఒక్కటే. కాకపోతే వి.వీ.ఐపి కోటా లో శ్రీవారిని చూడడానికి పడే కష్టం వేరు, సర్వదర్శనం కోటాలో అందరితో కలిసి కష్టపడి అన్ని అగచాట్లు పడి దర్శనం చేసుకోడం వేరు కదా! హద్దులు దాటిన పోటీతత్వంలో జల్లెడ వడపోతలు తప్పవు. రోటిలో తలపెట్టి రోకలి పోట్లకి భయపడితే ఎలా మరి?

ఇలా అనుకున్న వెంటనే వచ్చే ప్రశ్న "అసలు ఎవరు తల పెట్టమన్నారు?" అనే కదా. రాజు గారి ఏడవ కొడుకు వేటకు వెళ్లి తెచ్చిన చేప ఎందుకు ఎండలేదో కనుక్కోడానికి తీగ పట్టుకుని వెళ్లినట్టు వెళితే అలా పోయి పోయి మా తరం పదవ క్లాసు దగ్గర ఆగింది. ఒక అమ్మాయిగాని అబ్బాయి గాని పదవ తరగతి మొదలుపెట్టినప్పుడే వారి భవిష్యత్తు 'ఎం.పి.సి' తీసుకోవాలా లేదా 'బై.పి.సీ' తీసుకోవాలా అనే విషయంపై మాత్రమే ఆధారపడి వుంది అనే ఉద్దేశ్యంలో సగటు ఆంధ్రదేశం ఉంది అప్పటికి (ఇప్పటికి కూడా) .

ఆ తరువాత ఇంటర్మీడియట్ చదవడానికి పుట్టిన ఊరిని, అమ్మానాన్నలని వదిలి హాస్టల్ వెళ్లడం అనేది ఎంసెట్ మొదలుపెట్టినప్పటినుండి వస్తున్న ఆచారం. అప్పుడే అయిపోయాయి జీవితంతో మా అప్పగింతలు, అమ్మాయిలకి గాని అబ్బాయిలకి గాని. ఈ కార్పొరేట్ చదువుల కోసం అమ్మావాళ్లు మాకు ఊహ తెలిసినప్పటినుండి ఒకటి ఒకటీగా పొదుపుచేయడం చూస్తూ పెరిగిన పిల్లలం. చదువుకున్నాం. ఒక విప్లవం లాగా చదువుకున్నాం. ఒకరికొకరం చెప్పుకుని, కలుపుకుని, ఒకరినొకరం తొక్కేసుకుని, ఒక్కొక్క మెట్టే ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ చదువుకున్నాం. మాకు ఇంకో ఆలోచన లేదు, రాలేదు.

వేరే ఏ కళలు, వ్యాపకాలు, మోరల్ సైన్సులు మాకు తెలీవు. అద్భుతంగా సంస్కృత కావ్యాలని, గాథలను కళ్లకి కట్టినట్టు ఆవిష్కరించే క్లాసుని కేవలం ఇంటర్ బోర్డు ఎగ్జామ్స్ కి ముందు ఒక నెలరోజులు మార్కులకు అనుకూలంగా మలచబడ్డ కరికులం సాక్షిగా చెప్తున్నాను. కళ్లకు కట్టినట్టు తన కంచు కంఠంతో భారతంలోని పద్మవ్యూహ్యా నిర్మాణాన్ని చెప్పిన సంస్కృత మాష్టారు ఇంకా గుర్తే. ఇటువంటి ఇష్టాలన్నీ పక్కనపెట్టి మరీ చదివేసాము. .. డెబ్బైమూడేళ్ళ స్వాతంత్ర్యం తర్వాత కూడా 90మార్కులు తెచ్చుకున్న వారిని 40 మార్కులు తెచ్చుకున్న వారితో సమానంగా చూసే వ్యవస్థలో కొట్టుమిట్టాడాము.

అప్పుడు మొదలెట్టిన పరుగు తరువాత డిగ్రీలు పోగేసుకుని, ఉద్యోగాలు చూసుకుని, తోడు ఒకరిని వెతుక్కుని, గూడు ఒకటి ఏర్పరచుకుని ఇలా కొనసాగుతూనే ఉంది. ఇన్ని మలుపులలోనూ మా వెనుక నిలిచి మా ప్రతి గెలుపులో తమ విజయం చూసుకునే తల్లి తండ్రుల ఆనందాలే మా విజయాలకి కొలమానాలు. చదువు మా విజ్ఞానాన్ని బ్రహ్మాండమంత చేసింది. ఈ బ్రహ్మాండం మొత్తాన్ని టెక్నాలజీ మా అరచేతిలో ఉంచింది. అవకాశాల వైపు, మెరుగైన అవకాశాల వైపు మాత్రమే మా అడుగులు పడ్డాయి. మాకు చిన్నప్పటినుండి ఇచ్చిన తర్ఫీదు అటువంటింది.

ఇంట్లో పెద్దవారు ఏదో ఒక పని చెయ్యనిదే ఉరికెనే ఉండలేరు. ఏ పని చెయ్యడానికి లేకపోతే బియ్యం మూట తెచ్చుకుని కూర్చునేది నాయనమ్మ వేరుచేస్తాను అనుకుంటూ. ఉండలేదు ఖాళీగా. వాళ్ల తరం అలా పెరిగింది. మేము ఇలా! ఇంకా బెటర్ గా ఏమి చేయొచ్చు అని తహతహలాడే మాకు అమెరికా కనిపించింది. అప్పటికే అక్కడ ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రవాసులు రోల్ మోడల్స్ అయ్యారు. డాలర్ డ్రీమ్స్ మొదలయ్యాయి. సదా వెన్ను తట్టి ప్రోత్సహించే తల్లితండ్రులు. మేధ కి బోలెడు అవకాశాలు అంటూ "ల్యాండ్ ఆఫ్ ఆపర్చునిటీస్" రా రమ్మని చెయ్యి చాచింది. టోఫెల్, జిఆర్ఇ రెక్కలు కట్టుకుని వాలిపోయాం.

ఎంత చెట్టుకి అంత గాలి కదా! ఇక్కడ కూడా విపరీతమైన పోటీ. మజ్జిగ పల్చబడింది. ఆపైన మారిన రాజకీయ, ఆర్ధిక, సామజిక, అంతర్జాతీయ పరిస్థితులు. కారణాలు ఏవైతేనేం ఇక్కడ కూడా ముడి బిగిసింది. వడపోతలు, పరీక్షలు ఎక్కువయ్యాయి. మార్గం కష్టతరమైనా అలవాటైన పోరాటమే కదూ, పట్టు వదలని విక్రమార్కుల్లా పోరాడుతూనే ఉన్నాం. ఎల్.కే.జి నుండి చూస్తున్న పోటీలు మరి.

అటు చూస్తే రాకెట్ స్పీడ్ లో దూసుకుపోతున్న భారతదేశం. ఇక్కడికి వచ్చి రెండేళ్లకోసారి వెళ్లినా గుర్తుపట్టలేనంత మార్పు. మనుషులలోను, వ్యవహారాలలోనూ ఉక్కిరిబిక్కిరయ్యేంత వేగం. సెలవులయ్యాక హాస్టల్ కి తిరిగి వెళ్లడం ఎంత సహజమో అంతే సహజంగా మారిపోయాయి మా ఇండియా ట్రిప్పులు. మార్పు చాలా వేగంగా దూసుకొచ్చేసింది. మాతో ముడేసుకుని తీసుకుని వచ్చిన గుర్తులేవీ మిగలటం లేదు. అంతలా రూపు రేఖలు మారిపోతున్నాయి రోజు రోజుకీ. మిగిలినవన్నీఅప్పటి జ్ఞాపకాలే.

అప్పుడప్పుడు దేశం విడిచి వెళ్లిపోయారు అని ట్రోలింగ్ చేసినప్పుడు కలుక్కుమంటుంది కానీ, ఒకే ప్రశ్న మళ్లీ .. దేశం అంటే ఇప్పుడు ముప్పావు మందికి హైదరాబాద్, బెంగళూరు, ముంబై , పూణ ఇలా ఐటీ హబ్ లే. అక్కడికి తిరిగి వెళ్లినా 'సెలవులకి – అమ్మానాన్నలకి – ఊరికి' ముడి పెట్టాల్సిందే. పుట్టి పెరిగిన ఊర్లలో ఉండేది ఎవరు? మూలాలకి తిరిగి వెళ్లినా ఏమి చెయ్యాలో తెలీని అయోమయపు తరం మాది. పుస్తకాలతో తప్ప ప్రకృతితో పరిచయం లేని జీవన శైలి. గుట్టు మట్లు విడమరిచి చెప్పే తరమూ వెళ్ళిపోయింది!

దేశం అంటే మెట్రో సిటీలు మాత్రమే కాదు కదా. మా ఊర్లు ఉన్నాయి, చిన్న చిన్న టౌన్లు ఉన్నాయి. అందులో పెద్దాళ్ళు ఉన్నారు. సంవత్సరాలుగా ఎదురుచూసినా సహకరించని వాతావరణంతో కుస్తీ పడుతూ వ్యవసాయాలు చేసే వారు ఉన్నారు, ముందు నుండి అలవాటైన టౌన్లలోనే ఉండిపోయిన వారు ఉన్నారు. వారిని, భూమిని చూసుకోవాలంటే ముందు మేము నిలదొక్కుకోవాలి. మా అందరిలో మొదటి సారి అమెరికా వచ్చిన అన్నయ్య తరువాత ఊరిలో ఎంత మార్పు? ఇల్లు మారింది, పరిస్థితులు మారాయి, బోర్లు వేసుకున్నారు, పెద్దవాళ్ళ కష్టం తగ్గింది. అన్నయ్య అడ్డు పడక పోయుంటే తాతలనాటి భూములు ఈపాటికి ముక్కలై పోయి ఉండేవి. ఊర్లో అందరికి అండగా ఉన్నాడు, చదువుకునే పిల్లలకి ఎంతో సాయం చేసాడు. ఆపైన బయటికి వెళ్లిన వారు ఎవరూ కూడా ఊరిని మరచిపోలేదు. అదే కొనసాగిస్తున్నారు. ఊరు ఎప్పుడూ మనసుకు దగ్గరగానే ఉంది మాకు. మార్పు వైపు పయనమే మమ్మల్ని ఇక్కడి దాకా తీసుకొచ్చింది.

తిరిగి మళ్లీ మొదలు పెట్టినా ఇక్కడికే వచ్చి వాలుతామేమో. ఒక కాలానికి సంబంధించిన మార్పులను ఎవరు చెరపగలరు. ప్రస్తుతం అన్ని వసతులూ ఇచ్చి, నీడనిచ్చిన దేశం అమెరికా. మా కుటుంబాలకి, నేరుగానో ఇంకో విధంగానో మరికొంతమందికి సాయం చేయగలిగే స్థోమత ఇచ్చిన దేశం అమెరికా. మేలు చేసిన వారికి కృతజ్ఞతగా ఉండమని నేర్పిన ధర్మం. ఇంతవరకే ఆలోచిస్తున్నాము. ఎందుకంటే

చాలామందికి జీవితం అంటే రోజు వారి పోరాటం, నెల నెలా కట్టవలసిన బిల్లులు, పిల్లలు వారి భవిష్యత్తు కాబట్టి. ఆ తరువాతే మిగతావి ఏమైనా. నడచి వచ్చిన దారులను మరచిపోకుండా, పడ్డ కష్టాలను గుర్తుంచుకుని, వర్తమానాన్ని గౌరవిస్తూ ముందుకు సాగిపోడమే ఇక.

*(వచ్చే నెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments